

రూ.2,01,116 లక్షల విరాళాలు


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ములకల సుబ్బారావు (కాకినాడ) రూ.1,01,116, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు రూ.లక్ష చొప్పున విరాళాలిచ్చారు.



విఘ్నేశ్వరునికి బంగారు సూత్రాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామికి మునుకుంట్ల సూర్యమోహన్ దంపతులు (ఇనుకపూడి) రూ.లక్ష విలువైన 11 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు 4 సమర్పించారు.

డెల్టాలకు 12,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెరవలి: ఏకాదశి పర్వదినం కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వందలాదిగా భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి మరీ స్వామిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను అర్చకులు విశేషంగా అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాతల ఆర్థిక సాయంతో 7 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ప్రతి శనివారం అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన స్వామి వారి పూలాలంకరణ, ప్రసాదం, నిత్య గోత్రార్చన, అన్నదానం తదితర కార్యక్రమాలకు విరాళాలు స్వీకరిస్తున్నామని చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిత్యం యోగా సాధన చేయడం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక గ్రాండ్ ట్రంక్ రోడ్డు నుంచి లాలాచెరువు సెంటర్ వద్ద గల సూర్య నమస్కారాల పార్కు వరకూ శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, సరస్వతీ ఘాట్, గౌతమ ఘాట్‌లో సాంఘిక సంక్షేమం, ఆయుష్, ఏపీ టూరిజం, మున్సిపల్, వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యాన యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నెల రోజుల పాటు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని అన్నారు. 4,500 వేదికల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఘాట్‌లు, ముఖ్య కూడళ్లు, సచివాలయాల పరిధిలో యోగా దినోత్సవం విజయవంతంగా జరిగాయన్నారు. యోగా గురువులుగా నమోదైన వారికి, మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి



మొక్క నాటుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అధిక ఉష్ణోగ్రతల నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. స్థానిక ఏకేసీ డిగ్రీ కళాశాల సమీపాన శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలసి ఆమె పాల్గొన్నారు. ఉద్యోగులు, స్థానికులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరైన రీతిలో తొలగించకపోతే, వాటి నుంచి వెలువడే లెడ్ వంటి రసాయనాలు ప్రజలకు ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తాయని అన్నారు. దీని వలన క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. వీటిని ఈ–వ్యర్థాల సేకరణ కేంద్రంలో అందజేస్తే సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి, ముప్పు తప్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.





కోకో కాయలు



దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద రోడ్డుపై అరబెట్టిన కోకో గింజలను ఒబ్బిడి చేస్తున్న రైతు

కోలుకోలేక..

- కోకో సాగుకు ఎకరాకు రూ.2 లక్షల వ్యయం
- ఆదాయం రూ.1.30 లక్షలు
- నష్టం రూ.70 వేలు
- పెట్టుబడి రాక కోకో కౌలు రైతుల దిగాలు
- మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్

దేవరపల్లి: కంపెనీలు సిండికేట్ కావడం.. గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోకో రైతులు ఈ ఏడాది కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత పంట కాలంలో ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ ఆదాయం రావడంతో మంచి లాభాలు కళ్లజూశారు. కొంత మంది రూ.కోటికి పైగా కూడా ఆదాయం పొందారు. దీంతో, 2024–25 పంట కాలంలో అధిక ధరకు కోకో తోటలు కౌలుకు తీసుకున్నారు. 2022–23లో ఎకరం కౌలు రూ.20 వేల నుంచి రూ.25 వేలుండగా, 2023–24లో అది రూ.30 వేలకు పెరిగింది. అప్పట్లో కిలో గింజలకు మార్కెట్లో రూ.250 నుంచి రూ.275 వరకూ లభించేది. అటువంటిది 2023–24లో కిలో గింజలకు ఏకంగా రూ.1,050 పలకడంతో కోకో రైతుల పంట పండింది. ఈ నేపథ్యంలో 2024–25 పంట కాలానికి ఎకరం తోటను రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షలకు కౌలుకు తీసుకుని సాగు చేశారు. దీనికి అదనంగా సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ పెట్టుబడి పెట్టారు.

పూతలు దెబ్బ తిని.. ధర పతనమై..

జిల్లాలోని రైతులు కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నారు. వీరిలో 80 శాతం మంది కౌలుదారులే ఉన్నారు. మార్కెట్ **బాగుంటే ప్రధాన పంట కంటే కోకోకు ఎక్కువ ఆదాయం వస్తుంది. గత ఏడాది మార్కెట్ బాగుండి నాలుగు డబ్బులు మిగలడంతో ఎక్కువ మంది రైతులు తోటలను కౌలుకు తీసుకున్నారు. ఒక్కో రైతు 10 నుంచి 20 ఎకరాల కోకో తోటలు కౌలుకు తీసుకున్నారు. అయితే, తానొకటి తలిస్తే దైవమొకటి తలచి**నట్లు.. మంచు ధాటికి రెండు దఫాలు పూతలు దెబ్బ తిన్నాయి. మూడోసారి పూతలు నిలబడినప్పటికీ దిగుబడి తగ్గిపోయింది. ఎకరాకు రెండు మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దిగుబడి తగ్గడంతో మార్కెట్లో ధర బాగుంటుందని రైతులు ఆశించారు. కానీ, వారి ఆశలు తల్లకిందులయ్యాయి. ఫిబ్రవరిలో కిలో గింజలకు రూ.800 ధర లభించగా.. కొద్ది రోజుల్లోనే అది రూ.650 తగ్గింది. ఇదే ధర రెండు నెలలు **కొనసాగింది. అనంతరం రూ.400 నుంచి రూ.450కి పడిపోయింది. ఇదే సమయంలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో కోకో గింజలు రైతుల వద్ద పేరుకుపోయాయి. ఏదో ఒక ధరకు అమ్ముకుందామన్నా కొనుగోలుదారులు రాని పరి**స్థితి. ఏటా జిల్లాలోని రైతుల నుంచి క్యాడ్‌బరీ సంస్థ ఎక్కువగా కోకో గింజలు కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది కొనుగోలు సంస్థలు సిండికేట్ అయి, ధర తగ్గించేయడంతో గత్యంతరం లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేశారు. కోకో గింజలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కోకో రైతు సంఘాలతో మంత్రి కె.అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. కంపెనీలు ఇచ్చే ధరకు అదనంగా కిలోకు రూ.50 ఇవ్వడానికి అంగీకరించారు. రైతుల వద్ద ఉన్న ప్రతి కోకో గింజా కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ మేరకు కోకో రైతుల నుంచి వినతులు స్వీకరించడానికి కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఉద్యానవన, ఇతర అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి కోకో రైతులు పండించిన పంట వివరాలు సేకరించారు. కానీ, కోకో గింజల ధర మాత్రం పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో కోకో సాగు విస్తీర్ణం	13,299 ఎకరాలు
కోకో గింజల ఉత్పత్తి	531 మెట్రిక్ టన్నులు
రైతులు	1,500
ఇప్పటి వరకూ కొన్న గింజలు	250.17 మెట్రిక్ టన్నులు
విక్రయించిన రైతులు	546

కోకో రైతు సంఘ సమావేశం తీర్మానాలు

నిడదవోలు మండలం కోరుమామిడిలో శనివారం జిల్లా కోకో రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

- అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర ఇవ్వాలి.
- రాష్ట్రంలో కోకో బోర్డు ఏర్పాటు చేయాలి.
- వెంకటరామన్నగూడెంలో కోకో పరిశోధన కేంద్రం నెలకొల్పాలి.
- రైతుల వద్ద ఉన్న కోకో గింజలను పూర్తిగా కొనుగోలు చేయాలి.
- కంపెనీల సిండికేట్ విధానాన్ని, మోసాలను అరికట్టాలి.
- విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపు చేయాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోకో రైతులను ఆదుకోవాలి.

రూ.5 లక్షల నష్టం



కృష్ణంపాలెం వద్ద ఎకరం రూ.లక్ష చొప్పున 10 ఎకరాల కోకో తోట కౌలుకు తీసుకున్నాను. పెట్టుబడి మరో రూ.5 లక్షలైంది. ఎనిమిదేళ్లుగా ఇదే తోట కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. గత ఏడాది ఎకరం కౌలు రూ.33 వేలు కాగా, ఈ ఏడాది రూ.లక్ష అయ్యింది. గత ఏడాది ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఎకరాకు రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 2.5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ధర లేకపోవడంతో ఎకరాకు రూ.1.20 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. పదెకరాలకు సుమారు రూ.5 లక్షల నష్టం వచ్చింది. ఈ ఏడాది కౌలు రైతులు నిండా మునిగారు.

– కేతా నాగరాజు, కౌలు రైతు, చిక్కాలపాలెం, చాగల్లు మండలం

ధర పతనమైంది



ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బందులు పెట్టాయి. సీజన్ ప్రారంభంలో కిలో కోకో గింజల ధర రూ.650 నుంచి రూ.700 వరకూ పలికింది. అనంతరం ధర పతనమైంది. కొనుగోలుదారులు ముందుకు రాలేదు. నాకు 12 ఎకరాల కోకో తోట ఉంది. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కిలో రూ.500కు కొనుగోలు చేస్తున్నారు. కంపెనీలు రూ.450 చెల్లిస్తుండగా, ప్రభుత్వం రూ.50 ఇస్తోంది.

– యలమాటి భాస్కరరావు, కోకో రైతు, కురుకూరు, దేవరపల్లి మండలం

అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి



అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజల ధర రూ.850 ఉంది. కంపెనీలు రూ.450 మాత్రమే చెల్లిస్తూ, రైతులను మోసం చేస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు తగ్గడంతో పాటు కంపెనీలు సిండికేట్ కావడంతో పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలూ పడ్డాం. వచ్చే ఏడాది కోకోకు మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడిస్తున్న ధర గిట్టుబాటు కాదు. మద్దతు ధర ఇవ్వకపోయినా అంతర్జాతీయ మార్కెట్ ధర ఇస్తే చాలు. నాకు మూడెకరాల భూమి ఉండగా, పదెకరాలు రూ.13 లక్షలకు కౌలుకు తీసుకున్నాను. పెట్టుబడి రూ.7 లక్షలైంది. దిగుబడి ఎకరాకు 3 క్వింటాళ్లు వచ్చింది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు రూ.1.50 లక్షలు వస్తున్నాయి. పెట్టుబడి రావడం కష్టం. కిలోకు రూ.650 ఇస్తేనే గిట్టుబాటు అవుతుంది.

– ఉప్పల కాశీ, ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కోకో రైతు సంఘం, కోరుమామిడి

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



రైతు పండించిన ప్రతి కోకో గింజా కొనుగోలు చేస్తాం. క్షేత్ర స్థాయిలో 1,140 మంది రైతుల వద్ద 331 మెట్రిక్ టన్నుల కోకో గింజలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెలాఖరులోపే రైతుల నుంచి పంట పూర్తిగా సేకరిస్తాం. రైతులు తమ వినతులను నేరుగా లేదా ఫోన్ ద్వారా ప్రత్యేక సెల్‌కు తెలియజేయవచ్చు.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

సర్టిఫికెట్ల పరిశీలనకు 99 మంది హాజరు



విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం శనివారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఈ పరిశీలనకు 1 నుంచి 15,000 వరకూ ర్యాంకు పొందిన విద్యార్థులు 99 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం 15,001 నుంచి 32,000 ర్యాంకు వరకూ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో యువతకు మోసం

- యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు



కొవ్వూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కంఠమని రమేష్, నాయకులు

తాళ్లపూడి (కొవ్వూరు): యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను సైతం పీకేసి వారిని చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. కొవ్వూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద యువత పోరు పోస్టర్‌ను నియోజకవర్గ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్ బాబు, పార్టీ నాయకుల చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం తలపెట్టిన యువత పోరు ధర్నాలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు ఏడాది కాలంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.3 వేల భృతి తక్షణమే ఇవ్వాలన్నారు. సుమారు 3 లక్షల మంది ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తొలగించిందని చెప్పారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమని రమేష్‌బాబు మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి 2 లక్షల మంది వలంటీర్లను నియమిస్తే, గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తామని చెప్పి వారిని తొలగించారని చెప్పారు. మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులను, రేషన్ వాహనాలను తొలగించి వారి ఉపాధికి గండి కొట్టారన్నారు. యువత పోరులో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, చాగల్లు మండల కన్వీనర్ మట్టా వెంకట్రావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, అంకోలు శ్రీపద్మ, మద్దినట్ల సాయి గీత, ఏలూరి విజయలక్ష్మి, పద్మ, కొయ్యే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో 'నన్నయ'కు 'మిరాకిల్' రికార్డు



మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందుకుంటున్న ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఆదికవి నన్నయ యూనివర్సిటీని మరో రికార్డు వరించింది. ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ని సొంతం చేసుకున్న వర్సిటీకి తాజాగా మిరాకిల్ వరల్డ్ రికార్డు లభించిందని వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఆమె అందుకున్నారు. గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకూ జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో వర్సిటీ పరిధిలో రికార్డు స్థాయిలో 18,662 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఈ అవార్డు వచ్చిందని వీసీ వివరించారు.

కస్సుబస్సులు

- ప్రయాణికులకు 'యోగాంధ్ర' కష్టాలు
- ఉమ్మడి 'తూర్పు' నుంచి 502 బస్సులు 'చలో వైజాగ్'
- ప్రయాణాలకు నరకం చూసిన జనం
- ఆర్టీసీ బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు



సీటు కోసం పాట్లు : రాజమహేంద్రవరంలో రాకరాక వచ్చిన బస్సులోకి తోసుకుంటూ ఎక్కుతున్న జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆర్టీసీ బస్సు రూటు మారింది.. యోగాంధ్ర రికార్డు కోసం విశాఖపట్నం దారి పట్టింది.. ఫలితంగా ఇబ్బందులు పడటం ప్రయాణికుల వంతయ్యింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. దీనిని గొప్పగా నిర్వహించామని చెప్పుకొనేందుకు, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు ప్రహసనం నడిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వారం రోజులుగా అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులనూ యోగాంధ్ర కార్యక్రమం పైనే మోహరించారు. దీనికి ముగింపుగా విశాఖలో ప్రధాని పాల్గొనే యోగా దినోత్సవానికి భారీగా జనాల్ని తరలించేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వందలాదిగా ఆర్టీసీ బస్సులతో పాటు వివిధ ప్రైవేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలల బస్సులను వినియోగించారు. దీనికోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం గురువారం నుంచి శనివారం వరకూ మూడు రోజుల పాటు సెలవులు కూడా ప్రకటించింది.

జిల్లాల వారీగా..

- కాకినాడ జిల్లా నుంచి ఆర్టీసీ 155 బస్సులను విశాఖకు తరలించారు. ఈ నేపథ్యంలో కాకినాడ – రాజమహేంద్రవరం, కాకినాడ – అమలాపురం నాన్‌స్టాప్ సర్వీసులను కుదించేశారు. నాన్‌స్టాప్ బస్సుల కోసం గంట, రెండు గంటల పాటు వేచి చూడాల్సిన దుస్థితి ఎదురవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ – రాజమహేంద్రవరం, కాకినాడ – విజయవాడ సర్వీసులలో కోత పెట్టారు. కాకినాడ నుంచి మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, గోకవరం, ఏలేశ్వరం, తుని తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్డినరీ సర్వీసులలో రెండింతలు కోత పెట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- తూర్పు గోదావరి జిల్లాలోని 4 డిపోల నుంచి 185 బస్సులను విశాఖకు తరలించుకుపోయారు. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు ఆర్టీసీ డిపోల్లో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు మండిపడ్డారు. రాజమహేంద్రవరం మెయిన్ బస్టాండుతో పాటు రైల్వేస్టేషన్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు.
- కోనసీమ జిల్లాలోని 4 డిపోల నుంచి మొత్తం 162 బస్సులను విశాఖ యోగాంధ్ర కార్యక్రమానికి తరలించారు. అమలాపురం నుంచి విజయవాడకు ప్రతి అరగంటకు ఒక బస్సు నడిచేది. అటువంటిది విశాఖకు బస్సులు తరలించేయడంతో రెండు గంటలకొకటి చొప్పున మాత్రమే బస్సులు నడవడంతో ప్రయాణికులు నానా కష్టాలూ పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు, నైట్ సర్వీసులు సైతం దాదాపు మూడు వంతులు రద్దు చేశారు. అమలాపురం – కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులను కూడా తగ్గించేశారు. ఈ రూటులో ప్రతి అరగంటకు ఒక నాన్‌స్టాప్ తిరిగేది. చలో విశాఖ ప్రభావంతో రెండు గంటలైనా నాన్‌స్టాప్ సర్వీసు లేక ప్రయాణికులు నరకం చవి చూశారు. విజయవాడ, విశాఖపట్నంతో పాటు పల్లె వెలుగు సర్వీసులను కొన్ని రూట్లలో రద్దు చేశారు. అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలు డిపోల నుంచి తక్కువ సంఖ్యలోనే బస్సులు నడపడం జనానికి శాపంగా మారింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి డిపోల వారీగా విశాఖకు తరలించిన ఆర్టీసీ బస్సులు

డిపో	మొత్తం బస్సులు	విశాఖకు తరలించినవి	మిగిలినవి
కాకినాడ	166	66	100
తుని	72	44	28
ఏలేశ్వరం	49	45	4
అమలాపురం	143	60	83
రావులపాలెం	71	41	30
రామచంద్రపురం	52	40	12
రాజోలు	53	21	32
రాజమహేంద్రవరం	148	77	71
గోకవరం	63	44	19
కొవ్వూరు	52	39	13
నిడదవోలు	37	25	12

బోసిపోయిన బస్టాండ్లు

ఉమ్మడి జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల నుంచి 502 బస్సులను విశాఖ యోగాంధ్ర కార్యక్రమానికి తరలించుకుపోయారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను రవాణాశాఖాధికారుల ద్వారా నయానా భయానా దారికి తెచ్చుకుని వినియోగించారు. విద్యా సంస్థల బస్సుల మాటెలా ఉన్నా ఆర్టీసీ బస్సులు తగినన్ని లేకపోవడంతో ఆయా బస్టాండ్లలో ప్రయాణికులు శుక్ర, శనివారాల్లో తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేక ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. దూర ప్రాంతాలతో పాటు పల్లె వెలుగు బస్సులు కూడా తగినన్ని లేకపోవడంతో ప్రయాణికులు నరకం కళ్లజూశారు. బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు పడ్డారు. పల్లెలకు వెళ్లే సర్వీసులను దాదాపు రద్దు చేశారు. నడినెత్తిన సూరీడు చుర్రుమంటున్నా.. రోడ్డు పైనే బస్టాపుల వద్ద గంటల తరబడి చెమటలు కక్కుతూ పడిగాపులు పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పలువురు ప్రయాణికులు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో ఆటోలకు డబుల్ చార్జీలు కూడా డిమాండ్ చేశారు. పలుచోట్ల ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

మీ వ్యర్థాలు మీ ముందే..

- కోళ్ల వ్యర్థాలు తీసుకెళ్లి ఆ షాపు ముందే వేసి హెచ్చరిక
- అధికారుల వినూత్న నిర్ణయం



గోగన్నమఠంలో షాపు ముందు వేసిన కోళ్ల వ్యర్థాలు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ ప్రధాన రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మగటపల్లి నుంచి గోగన్నమఠం వెళ్లాలంటే ఇక్కడ ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. సమీపంలోని కోళ్ల మాంసం దుకాణం యజమాని వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ వేస్తున్నాడని పంచాయతీ ఉద్యోగులు చెబుతున్నారు. అక్కడ కోళ్ల వ్యర్థాలు వేయవద్దని చెబుతున్నా వినకపోవడంతో శనివారం వినూత్న నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ అల్లు విజయలక్ష్మి సురేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు రోడ్డుపై వేసిన కోళ్ల వ్యర్థాలను మూటలు కట్టి పంచాయతీ రిక్షాపై చికెన్ షాపు వద్దకు తీసుకు వెళ్లారు. ఆ వ్యర్థాలన్నీ ఆ షాపు ముందే వేశారు. ఇక ముందు రోడ్డుపై కోళ్ల వ్యర్థాలు వేస్తే ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని గట్టిగా హెచ్చరించారు. చివరికి ఆ షాపు యజమాని దిగొచ్చి వ్యర్థాలను జన సంచారం లేని ప్రాంతంలో వేసేందుకు అంగీకరించడంతో సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది.

చల్లని తల్లి... మా కల్పవల్లి

- పెద్దాపురం మరిడమ్మ జాతరకు వేళాయె
- తెలుగు రాష్ట్రాల్లోనే వేడుకలకు ప్రసిద్ధి
- 24 నుంచి జాతర మహోత్సవం

పెద్దాపురం: చల్లని తల్లి... మా కల్పవల్లి... మమ్మేలు మాతా అంటూ ఆ మరిడమ్మ వారిని భక్తజనం కొలుస్తుంది. ఆధ్యాత్మికతతో అలరారుతున్న, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన, ఉమ్మడి రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 24 నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా 37 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా 24న జాతర ప్రారంభమై, జూలై 31వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఏటా లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. నిత్యం విశేష పూజలందుకుంటూ విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ ఉత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

చింతపల్లివారి ఆడపడుచుగా...

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో దేవతాలయాల్లో పెద్దాపురం శ్రీమరిడమ్మ అమ్మవారి దేవస్థానం ప్రసిద్ధమైంది. మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని సందర్శిస్తే కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. మరిడమ్మ వారు సామర్లకోట చింతపల్లివారి ఆడపడుచుగా ప్రాచుర్యం పొందారు. ఇప్పటికీ ఆ వారసులే ఇక్కడ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. వారి కుల దేవతగా పెద్దాపురం పట్టణంలో వెలసి యావత్ ఆంధ్రావని సంరక్షిస్తున్న వరదేవతగా ప్రఖ్యాతి గాంచారు. ఏటా ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు జాతరను జరపడం ఆనవాయితీగా వస్తోంది.

ఆనవాయితీగా గరగ ఊరేగింపు

ఆషాఢ మాసంలో అమ్మవారి జాతరకు ఉన్న ప్రత్యేకతతో పాటు గరగకు విశిష్ట పూజలు నిర్వహిస్తుంటారు. జాతర ఆరంభానికి ముందు నుంచీ తొలి గరగను ఊరేగించడం ఆనవాయితీ. పురవీధుల్లో గరగ తిరుగుతూ డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తుంటే భక్తులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అమ్మవారికి పొంప్పు, చీరలు వేయడం, కోరిన కోర్కెలు తీర్చడంతో ముడుపులు, మొక్కులు తీర్చుకునేందుకు వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తుంటారు.



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ వారు

వారానికో వీధి సంబరం

గ్రామ దేవతగా ఆరాధించే పెద్దాపురంలో ఆయా వీధుల వారు అమ్మవారి సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి అమ్మవారి సంబరం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వీధి సంబరాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. ఇది పట్టణంలో ప్రత్యేకతను చాటనుంది.



విద్యుద్దీపాలంకరణలో మరిడమ్మ ఆలయం



పెద్దాపురంలో మరిడమ్మ గరగకు ఊరేగింపు (ఫైల్)

24 రాత్రి నుంచి జాతర

ఏటా ఆషాఢ మాసం ఆరంభంలో నిర్వహించే మరిడమ్మ వారి జాగరణ మహోత్సవంలో భాగంగా ఈ నెల 24న రాత్రి అంగరంగ వైభవంగా జాతర ప్రారంభం కానుంది. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులతో పాటు ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే హాజరవుతారు. జాతరకు సంబంధించి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆసాదులు, వేదపండితులతో అమ్మవారి జాతర ఉత్సవం నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో సెట్టింగ్‌లు వేశారు.

అమ్మవారి కృపకు పాత్రులుకండి



కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ వారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలి. ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై జాతరను విజయవంతం చేయండి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది ఉత్సవాలను మరింత వేడుకగా నిర్వహించనున్నాం.

– విజయలక్ష్మి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, పెద్దాపురం

నేడు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మహాజన సభ



కోళ్ల బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 107వ సాధారణ మహాజన సభ ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజమహేంద్రవరం సాయికృష్ణ థియేటర్ ఎదురుగా మంగళవారపు పేటలో ఉన్న అల్యూమినియం కాస్ట్‌వేర్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ హాలులో జరుగుతుంది. ఈ విషయాన్ని ఆ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు (బాబు) ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహాజన సభకు హాజరయ్యే బ్యాంక్ 'ఎ' తరగతి సభ్యులు బ్యాంక్ మెంబర్ షిప్ కార్డు, ఖాతా పాస్‌బుక్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. లేకుంటే మహాజన సభకు అనుమతించబడదని తెలిపారు. సభ్యులు తమ చిరునామా, ఫోన్ నంబర్ల మార్పు ఉంటే తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్యనారాయణ

మామిడికుదురు: మాకనపాలెం గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారిపై శనివారం ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మామిడికుదురు శివారు గాలిదేవరపాలేనికి చెందిన బొడ్డపల్లి సత్యనారాయణ (45) సైకిల్‌పై ఈదరాడ వైపు వెళ్తుండగా, అదే మార్గంలో వెళ్తున్న ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొంది. దీంతో సత్యనారాయణ మృత్యువాడపడ్డాడు. సత్యనారాయణ వికలాంగుడు, అతను అవివాహితుడు. మృతుడి అన్నయ్య వీరాస్వామి ఫిర్యాదు మేరకు నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని సచివాలయ ఉద్యోగి మృతి



గొల్ల మహంతి బాల వెంకటేష్ (ఫైల్)



పందలపాకలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవిచంద్రకుమార్

బిక్కవోలు: రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి చెందిన ఘటన పందలపాక శివారులో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడ భానుగుడి శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన గొల్ల మహంతి బాల వెంకటేష్ (29) పందలపాక సచివాలయం–2లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడ సేవలు అందిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం ఇంటి నుంచి సచివాలయానికి వచ్చారు. అక్కడ గ్రామస్తులతో కలసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బిక్కవోలులో ఇంజినీర్ కార్యాలయానికి బయలు దేరారు. తాను పని చేస్తున్న సచివాలయం నుంచి కనీసం 400 మీటర్ల దూరంలో పందలపాక – ఊలపల్లి రోడ్డు వద్ద బిక్కవోలు వైపు వెళ్తున్న సిమెంట్ లోడు లారీ ఒక్కసారిగా కుడివైపు తిప్పి అతని బైక్‌ను కొట్టడంతో వెంకటేష్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఆ లారీ వెంటనే అతని తలపై నుంచి వెళ్లిపోయింది. వెంకటేష్ తలకు హెల్మెట్ ఉన్నా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన స్థలానికి భారీఎత్తున గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు చేరుకున్నారు. ప్రమాద తీరును ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య కావ్యసత్యశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పందలపాకలో విషాదం

ఐదేళ్లుగా సచివాలయ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతూ, అందరితో సరదా ఉండే ఉద్యోగి ఇలా మృతి చెందడంతో స్థానికులు మదనపడుతున్నారు. తమ్ముడు అనే పిలిచే వ్యక్తి ఇలా అకాలంగా మరణించడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఎప్పుడూ బైక్ నడిపినా హెల్మెట్ వాడేవాడని, అందరినీ హెల్మెట్ పెట్టుకోవాలని చెప్పేవాడని, అలాంటి వ్యక్తి బైక్ ప్రమాదంలో మృతి చెందడంతో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, మిత్రులు తమ్ముడు ఇక రాడంటూ ఆవేదన చెందుతున్నారు. తల్లిదండ్రులకు ఇతనే ఒక్కగానొక్క కుమారుడు. రెండేళ్ల కిందట దగ్గర బంధువని కావ్యసత్యశ్రీతో వివాహం జరిపించారు. కుటుంబానికి ఆసరా ఉంటాడని అనుకున్న కొడుకు ఇక లేకపోవడంతో తల్లిదండ్రులు, జీవితాంతం తోడుగా ఉంటానని చెప్పిన భర్త ఇకలేడని తెలిసి భార్య కావ్యసత్యశ్రీ బోరున విలపిస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ లీజులు రద్దు చేయాలి



తునిలో ఆదివాసీ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

తుని: ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్‌కు ఇచ్చిన లీజులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘ అధ్యక్షుడు జక్కంపూడి రాజు డిమాండ్ చేశారు. శనివారం తునిలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఆదివాసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మైదాన ప్రాంతాల్లోని ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలని, శంఖవరం మండలం పెదమల్లాపురం మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 యాక్ట్‌కు ఎటువంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ మాఫియాను అరికట్టి, ఆదివాసీలపై జరుగుతున్న కగారు ఆపరేషన్ తక్షణం నిలుపుదల చేసి, అక్రమ కేసుల్లో ఇరికించిన ఆదివాసీలను విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు, ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను వలస భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని, వీరి నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో అన్నవరంలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించేందుకు నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా కన్వీనర్ మోసూరి రాజు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన సన్యాసిరావు, మన్యం జిల్లా నుంచి కర్ర ఏసు, కాకినాడ జిల్లా నుంచి రేచుకట్ల సింహాచలం, ముసలయ్య, బాలరాజు, పందిరి ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్‌లు ఆదివాసీ సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

శ్రీనివాసా... శ్రీవేంకటేశా



వాడపల్లి క్షేత్రంలో ఏడు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

- భక్తజనంతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం
- ఒక్క రోజే రూ.60.17 లక్షల ఆదాయం

కొత్తపేట: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న వాడపల్లి క్షేత్రం భక్తజనంతో పోటెత్తింది. శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. శనివారంతో పాటు ఏకాదశి కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏడు శనివారాలు – ఏడు ప్రదక్షిణల నోము ఆచరిస్తున్న భక్తుల గోవింద నామస్మరణతో క్షేత్రం మార్మోగింది. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుల బృందం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. పూర్ణాలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంతో పులకించారు. అర్చకుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో క్షేత్రపాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈఓ చక్రధరరావు క్యూలైన్‌లో భక్తులతో సాధారణ భక్తునిలా కలసిపోయి వారి మనోగతం తెలుసుకునే ప్రయత్నం చేశారు. భక్తులతో పాటే స్వామి దర్శనం చేసుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం 5 గంటల వరకూ స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేద ఆశీర్వచనం, అన్నప్రసాద విరాళం, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవలు ద్వారా ఒక్క రోజు దేవస్థానానికి రూ.60,17,180 ఆదాయం వచ్చినట్లు ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

రాయవరం: మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులకు ఆదివారం కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నుంచి సమాచారం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న బదిలీ కౌన్సెలింగ్‌లో భాగంగా ఉదయం 9 గంటలకు 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 12 గంటలకు 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.